# కష్టజీవి



రాను రాను కొమురయ్య ధైర్యం కొడిగట్టిన దీపం లాగైంది. ఆత్మవిశ్వాసం అడుగంటింది. పల్లెటూళ్ళో రెక్కలు ముక్కలు చేసుకుని పని చేద్దామన్నా కూలిపని దొరకడం లేదు. రెండుపూటల తిండికి గడవడం దండి కష్టమైపోయింది. ఒక్కగానొక్క కూతురు అప్పుడే పదోతరగతి ఫస్టుక్లాసులో పాసైంది.

స్కూలు టీచర్లు "మీ శారద చదువులో హుషారుగుంది. పట్నంలో ఇంటర్ చదివిస్తే భవిష్యత్తు బాగుంటుం"దని మరీ మరీ నచ్చజెప్పారు. శారద కూడా చదువుకుంటానని మంకుపట్టు పట్టింది. శారద భవిష్యత్తు, భవిష్యత్తు బతుకుదెరువు... బతుకు బండికి రెండు చక్రాలై పట్నంబాట పట్టించాయి. అంతకుముందే సరదాకోసం ఆటోడ్రైవింగ్ నేర్చుకుని లైసెన్స్ కూడా తీసుకున్నాడు.

పట్నం చేరగానే ఆటోలు కిరాయికిచ్చే నాగభూషణం కాపాడుకుంటున్న యజమాని. రోజూ పదిమందికి ఆటోలు రోజువారీ కిరాయికిచ్చి అదే రోజు ఠంచన్‌గా డబ్బులు వసూలు చేసుకుంటాడు. ఆటోలను తన షెడ్డులోనే భద్రపరుచుకుంటాడు. నాగభూషణం నియమావళిలో ఒక రోజుకు పన్నెండుగంటలే. పొద్దున తీసుకెళ్ళిన ఆటోను సాయంత్రం క్షేమంగా అప్పజెప్పి తీరాలి. ఆటో తిరిగివ్వడం ఆలస్యమైనా, కిరాయి డబ్బులు తక్కువిచ్చినా మర్నాడు ఆటోమేటిగ్గా ఆటో దొరకదు. షరతులన్నింటికీ ఒప్పుకున్న తర్వాతనే కొమురయ్యకు కిరాయి ఆటో దొరికింది.

ఉండేందుకు ఊరిబయట లేబర్ కాలనీలో రేకుల గుడిసె కిరాయకు దొరికింది. దిగిపోయిన – ధైర్యం తిరిగి పుంజుకోగానే శారదకు ఇంటర్లో సీటు దొరికింది. పొద్దు పొడుపుతో పోటీపడుతూ నిద్రలేచి ఎనిమిదింటికల్లా ఆటో తీసుకెళ్ళి రాత్రి ఎనిమిదింటికి తిరిగివ్వడం అలవాటైంది. రాజీసూత్రములో బంధీయైన పట్నం జీవితం రెండేళ్ళు సాఫీగానే సాగింది.

కాని... ఇప్పుడు కొత్త సమస్య వచ్చిపడింది. ఎలాంటి కోచింగ్‌కు పంపించకున్నా శారదకు ఎంసెట్‌లో ర్యాంకు వచ్చింది. ఇంజినీరింగ్‌లో పేమెంట్ సీటొచ్చింది. అందుగ్గాను ముప్పై వేల రూపాయలు కక్కాలి. వారంరోజులే టైముంది.

కూతుర్ని జాలిగా చూస్తూ "అంత డబ్బు నేను కట్టలేనమ్మా. నా వల్ల కాదు తల్లీ!" చెబుతూ జబ్బలు జారేసాడు. శారద అలక మంచమెక్కింది. అన్న పానీయాలు ముట్టనంది. తల్లి యశోద మనసు ఒడ్డుకేసిన చేపపిల్లలా తల్లడిల్లింది. భర్తను మందలింపుగా చూస్తూ "మరెట్లానయ్యా! మనం మన కన్నపిల్లకేమన్నా ఆస్తిపాస్తులిస్తున్నామా? ఈ పెద్ద చదువు చదివిస్తే దాని కాళ్ళమీద అది నిలబడుతుంది. అప్పో-సొప్పో చెయ్యాలి గదా!" మొండి సలహా ఇచ్చింది.

"మనకు అప్పెవరిస్తారు యశోదా? కుదువ బెట్టేందుకు మనదగ్గరేముందనీ?" కొట్టిపారేసాడు.

"మీ యజమాని నడగాలి అప్పివ్వమని. రోజుకింత ఇచ్చి తీర్చుకుంటానని చెప్పెయ్" కరణేషు మంత్రి అనిపించుకుంది.

శారదను ఒడిలోకి తీసుకుని "మీ నాన్న ఏ తిప్పలన్నాపడి అప్పుజేసి ఆ ఫీజు కడ్తాడు గానీ నువ్వు బువ్వతిను తల్లీ!" బుజ్జగిస్తూ సముదాయించింది. తానే గోరుముద్దలు తినిపించింది.

కొమురయ్య మస్తిష్కములో ఆలోచనలు మొలకెత్తాయి. అప్పడిగితే యజమాని ఏమంటాడో! మరి... అప్పు అడక్కపోతే ఫీజు కట్టలేను. ఫీజు కట్టకపోతే శారద చదువాగిపోతుంది. చదువాగిపోతే మళ్ళీ నిరాహారదీక్షకు కూచుంటుంది. యశోద సలహా బాగానే ఉంది. పెద్దలిచ్చిన ఆస్తిపాస్తుల్లేవాయె. నాలాంటి కార్మికుడు చదువు చెప్పించడం తప్ప కన్న పిల్లలకేమివ్వగలడు? ఏమైనాసరే... అప్పు సంపాదించాలి. ఆటోరిక్షా కార్మికుని కూతురు హాయిగా ఇంజినీరింగ్ చదవాల్సిందే. దృఢనిర్ణయం పొద్దున్నే యజమాని ముందు నిలబెట్టింది.

అంతా విని యజమాని నెత్తిమీద బల్లిపడ్డట్టు ఉలిక్కిపడ్డాడు.

"పది ఆటోలున్నంత మాత్రాన నేను కొన్ని పదుల కోట్లకు పడగెత్తినాననుకున్నావా కొమురయ్యా?" నిట్టూరుస్తూ కుర్చీ వెనక్కు జేరగిలబడ్డాడు.

కాళ్ళుపొయ్యి కడుపులో చొచ్చినట్టైంది కొమురయ్యకు. అయినా లోపలి పరేషాన్‌ను లోపలనే అదిమిపెడుతూ...

"అట్లంటే ఎట్లానయ్యా? నా బిడ్డ అదే చదువు సదువుకుంటానని పట్టుబట్టింది. మీ దగ్గరనే పని చేస్తున్నాగదా! రోజుకింత వడ్డీతో సహా తీర్చేస్తా!" దీనంగా బతిమాలాడు.

యజమాని గుండె గోడలమీద ఏ పురుగు పాకిందో గాని "చూడు కొమురయ్యా! నువ్వు సగటు కార్మికుడివి. నేను సన్నకారు యజమానిని. మనిద్దరి మధ్య మంచి అవగాహన ఉండాలి. కానీ... ఆడపిల్లకంత పెద్ద చదువులవసరమా? ఏనాటికైనా ఓ అయ్యచేతిలో పెట్టాల్సిందే గదా!" నచ్చజెప్పబోయాడు.

కొమురయ్యకి అది ఏమాత్రం రుచించలేదు. "నిజమేనయ్యా! నేను కార్మికుణ్ణే. కానీ... కార్మికుని పిల్ల అయినంత మాత్రాన నా బిడ్డ చదువుకోవద్దా? మగపిల్లవాడి కంటే ఆడపిల్లకేం తక్కువ? దానికిప్పుడా ఫీజు కడితే ఐదేళ్ళలో ఇంజనీరైతది. ఆ తర్వాత మంచి పెళ్ళి సంబంధం దొరుకుతుంది. కట్నం లేకుండా పెళ్ళి చేసుకుని జీవితాంతం సుఖపడుద్ది" నిర్మొహమాటంగా అనేసాడు.

యజమాని అసహనంగా కదిలాడు. "ఫీజు కడితే అదంతా నిజమే కానీ ఉన్నపళంగా ముప్పైవేల రూపాయలు ఎక్కడ తెస్తావు? ఆ తర్వాత చదువుకోసం పుస్తకాలు, డ్రెస్సులు కూడా కొనాలి గదా!" మొహం ముడుచుకున్నాడు.

"అదేనయ్యా! మీరు అప్పుగా ఇప్పిస్తే రోజుకింత తీర్చేస్తా!".

యజమాని వాలకం గంభీరమైంది. "ఇప్పుడున్న సంపాదన నీ కుటుంబానికే సరిపోవడం లేదన్నావు గదా! ఇంకా అప్పు కింద ఏం కడ్తావూ?" సూటిగా అడిగాడు.

"ఇప్పట్నుంచి రాత్రి కూడా ఆటో నడుపుతానయ్యా! రాత్రి సంపాదనంతా అప్పుకింద కట్టేస్తా" సందేహ నివృత్తి చేసాడు.

"కానీ...." యజమాని నిరాశగా మూల్గాడు.

"అంత డబ్బు నా దగ్గర మాత్రం ఎట్లా దొరుకుతుంది? నేనే బ్యాంకు లోను తీసి, ఆటోలు కొన్నాను. దాంతోనే యజమానినై నీలాంటి వాళ్ళను బతికిస్తూ నేనూ బతుకుతున్నా".

బ్యాంకు పేరెత్తగానే కొమురయ్యలో మరో ఆశ తొంగి చూసింది. "మరీ... సదూకునేందుగ్గూడా బ్యాంకు అప్పు ఇస్తారా?" ఠపీన అడిగాడు.

'ఇస్తారట కానీ... దానికి ష్యూరిటీ అంటే జమానతు కావాలి. నీకు జమానతెవరిస్తారు? నేనైతే ఇప్పటికే బ్యాంకుకు బాకీపడున్నా. నా జమానతు చెల్లదంటారు" అనేసి లేచి బయటకెళ్ళిపోయాడు.

అజాగ్రత్తగా ఆటో నడుపుతూ అగాధములో కూరుకుపోయి నట్టనిపించింది. బాధను దిగమింగుతూ ఆటోతో బయటికొచ్చాడు.

దేవుడా! దిక్కులేనోళ్ళకు నువ్వే దిక్కంటారు గదా! నా శారద చదువు భారం నీదేనయ్యా!... అనుకుంటూ ఆటోతో మెయిన్‌రోడ్డు మీదికొచ్చాడు.

"ఏయ్, ఆటో!" సున్నితమైన కేక వినబడింది. ఆటోను రోడ్డు పక్కన ఆపేసాడు. ఓ యువతి వయ్యారంగా అడుగులేస్తూ ఆటో ముందుకొచ్చింది. మోడ్రన్ చీరకట్టు, ఓ చేతిలో బ్రీఫ్‌కేసు, మరో చేతిలో ఎయిర్‌బ్యాగు... టిప్ టాప్‌గా ఉంది.

"ఎక్కడికెళ్ళాలి మేడమ్?"

"ఎయిర్‌పోర్టుకు. అర్జంట్‌గా... ఫ్లైట్‌కు టైమవుతోంది" కంగారుగా చేతి గడియారం చూసుకుంది. మొహంలో ఆందోళన ఛాయలున్నాయి.

"ఎక్కండి మేడమ్!" ఆటో స్టార్ట్ చేసాడు.

మేడమ్ కూచుంది. కుడివైపు ఎయిర్‌బ్యాగు, ఎడమవైపు బ్రీఫ్‌కేసు లుంచింది. కొమురయ్య ఆలోచనల్లాగే ఆటోరిక్షా వేగంగా పరుగెడుతోంది.

"అంత అర్జంట్‌గా ఏ ఊరు వెళ్తున్నారమ్మా?" యథాలాపంగా అడిగాడు.

"బెంగుళూర్... త్వరగా పదా!"

ఆటో ఎయిర్‌పోర్టు ముందు ఆగింది. యువతి దిగ్గున దిగింది. యాభైనోటు చేతికిచ్చి బ్రీఫ్‌కేసు అందుకుంది. పరుగులాంటి నడకతో లోపలికెళ్ళి పోయింది. ఆ దృశ్యం అచ్చం సినిమాలో చూసినట్టుంది.

అరె... ఆమె మీటరే చూడలేదు. మిగతా చిల్లర అడగలేదు. ఈ కాలం పిల్లలకెంత తొందరనో! ఆటో వెనక్కు తిప్పుతూంటే లోపల ఎయిర్‌బ్యాగు కనబడింది.

అరెరే! మేడమ్ మరిచిపోయింది. కానీ... ఇప్పుడెట్లా? అటూ ఇటూ చూసాడు. మేడమ్ ఎప్పుడో మాయమైంది. పాపం! ఇందులో బట్టలున్నాయేమో! బ్యాగుజిప్ లాగి చూసాడు. కళ్ళు జిగేల్‌మన్నై.

అమ్మోయ్! పరాయి సొమ్ము మట్టిగడ్డతో సమానం. ఇది నాకొద్దుగానీ ... దీన్నెవరికివ్వాలి? ఎందుకైనా మంచిదని బ్యాగు పక్క జిప్ లాగి చూసాడు. అందులో విజిటింగ్ కార్డు, ఇంకేవో కాయితాలు ఉన్నాయి. కార్డు తీసి చదివాడు.

కుమారి కె. సుకన్య, సాఫ్ట్‌వేర్ ఇంజినీరు. డాటరాఫ్ కె.నాగరాజు... ఇంటి అడ్రసుంది. హమ్మయ్యా! దారి దొరికింది. ఊపిరి పీల్చుకుని ఆటోను అడ్రసు వైపు పరిగెత్తించాడు.

మూడంతస్తుల మేడ అది. బ్యాగుతో సహా గబగబా మెట్లెక్కుతూంటే ఆయాస మొస్తోంది. వేగం తగ్గించి మూడో అంతస్తు చేరుకున్నాడు. ఇంటి ముందు సైన్‌బోర్డుంది. బెల్ కొట్టాడు. రెండు నిమిషాల తర్వాత తలుపు తెరుచుకుంది.

ఒకాయన... తన వయసాయనే... ఎర్రగా బుర్రగా లుంగీమీదున్నాడు. ముఖము నిండా చిరాకు చిందులేస్తోంది.

"ఎవరయ్యా నువ్వు?" అసహనంగా అడిగాడు.

"నా పేరు కొమురయ్య. ఆటోవాలాను. మీరేనా నాగరాజుగారు?"

"అవును, అయితే ఏంటటా? ఏదన్నా పనుంటే అప్పటికి ఆఫీసుకు రావాలి. ఇప్పుడింటికొచ్చి నా నెత్తిమీద కూచుంటే నేనేం చెయ్యాలి?" దబాయించాడు. చూపుల్లో అనుమానం ఆనవాళ్లున్నాయి.

"అయ్యా! సారూ! ఈ బ్యాగు మీదేనా?" ఎయిర్‌బ్యాగు చూపించాడు.

వింతగా చూసి- "అవును. ఇది మా అమ్మాయి తీసుకెళ్ళింది గదా!" నాగరాజు గుండెల మీద చెయ్యేసుకున్నాడు.

"ఇది నీ దగ్గరికెట్లా వచ్చిందీ?" అయోమయంగా అడిగాడు.

కొమురయ్యకో క్షణం నోటమాట రాలేదు.

నాగరాజు బ్యాగులాక్కుని జిప్ విప్పి చూసాడు. తృప్తిగా ఊపిరి పీల్చు కున్నాడు. మరుక్షణంలోనే వాలకం మారిపోయింది. కళ్ళల్లో కోపం ఛాయలొచ్చేసినై.

"మా అమ్మాయినేం చేసావో చెప్పు. లేకపోతే పోలీసులకప్పజెప్తా" పళ్ళు పటపట లాడించాడు.

"ఆమె నా ఆటోలో ఎయిర్‌పోర్ట్‌కొచ్చింది సార్. ఇది ఆటోలోనే విడిచిపెట్టి దిగిపోయింది. మళ్ళీ కనబడలేదు. దీంట్లో మీ అడ్రసు చూసి తీసుకొచ్చాను. అమ్మతోడు సార్!" వణికిపోతూ చేతులు జోడించాడు.

గొప్ప నేరం చేసి వెంటనే పట్టుబడినట్లైంది నాగరాజుకు. గబుక్కున సెల్‌ఫోనందుకుని నెంబర్లు నొక్కాడు.

"హలో బేబీ!... ఆ... నేనే నాన్నను... ఓహో ఇప్పుడే విమానమెక్కబోతున్నావా!... ఆ... సరే! నువ్వు ఎయిర్‌బ్యాగ్ ఆటోలో మరిస్తే ఎట్లానమ్మా? ఆ... భయపడకూ. ఆటోవాలా తెచ్చిచ్చాడు. కావాలనే క్యాషు అందులో పెట్టిచ్చాను గదా! దొంగల దృష్టంతా బ్రీఫ్‌కేసు మీదుంటుందనుకున్నాం గదా!... క్యాషా! నిక్షేపంలాగుంది. సరే... తిరిగొచ్చెయ్. సాయంత్రం ట్రెయిన్‌కి వెళ్దువుగాని" మాట్లాడి సెల్‌ఫోన్‌ను సోఫా మీదుంచాడు.

"రా కొమురయ్య లోపలికిరా!" సాదరంగా పిలిచాడు.

కొమురయ్య వెన్నుపూసలోని సన్నని వణుకు తుగ్గుముఖం పట్టింది.

"నాకు ముఖ్యమైన పనుంది. వెళ్తానయ్యా!" వెనుదిరగబోయాడు.

నాగరాజు చెయ్యందుకుని లోపలికి తీసుకెళ్ళాడు. సోఫాలో పక్కన కూచోబెట్టు కున్నాడు.

"ఏమంత అర్జంటు పనీ?" లాలనగా అడిగాడు.

"నా బిడ్డ శారదకు ఇంజినీరింగ్‌లో పేమెంటు సీటొచ్చింది. ముప్ఫైవేల రూపాయలు కావాలి. అప్పుకోసం తిరుగుతున్నా సార్!"

"ఈ బ్యాగులో ఏముందో తెలుసా?"

"నోట్ల కట్టలున్నాయి గదా! నేనేమీ తీసుకోలేదు సార్. ఒట్టుసార్!" నెత్తిమీద చేతులుంచుకున్నాడు.

అయ్యో పాపం! అమాయకుడీ కార్మికుడు. నాగరాజుకు నవ్వొచ్చింది.

"నువ్వు దొంగవు కాదు కొమురయ్యా, దొరవు. నేను బ్యాంకు మేనేజర్ని. నువ్వు మానవత్వపు మహారాజువు" చేతులందుకుని కళ్ళకద్దుకున్నాడు.

"అయ్యో! ఇదేంది సారూ!" చేతులు వెనక్కులాక్కున్నాడు.

వెంటనే గుర్తొచ్చింది. "అయ్యా! నాకు ముప్పూటలా తిండికే గతిలేదు. అన్ని వేలు ఎక్కణ్నుంచి తేవాలె? దయచేసి మీ బ్యాంకులో అప్పు ఇప్పించండి సారూ!" బతిమాలాడు.

బ్యాంకు మేనేజర్ మనోసాగరములో కృతజ్ఞతా తరంగాలెగసి పడుతున్నాయి.

"ఈ బ్యాగులో ఎంత డబ్బుందో తెలుసా?" కావాలనే అడిగాడు.

"తెలవదు సారూ! ఎంత ఉంటే నాకెందుకూ? అది నాది కాదుగదా! కానీ..."

"అప్పు ఇప్పించమంటావు" నాగరాజు పెదాలమీద చిరునవ్వు మెరిసింది. "అప్పెందుకూ? ఇందులో మూడులక్షలున్నై. ముప్ఫైవేలు నువ్వే తీసుకో!" బ్యాగు అందివ్వబోయాడు.

కరెంటు షాకు కొట్టినట్లు దూరం జరిగాడు. "అమ్మో! అట్లా వద్దు సారూ! ఎవరన్నా పుణ్యాన్ని అమ్ముకుంటారా? దయచేసి బ్యాంకు అప్పు ఇప్పించండి. రోజుకింత తీర్చేస్తా. మీ మేలు మరిచిపోలేను. కానీ సారూ! నాకు జమానతెవ్వరూ దొరకరు. నన్ను నమ్మండయ్యా!" ప్రాధేయపడ్డాడు.

నాగరాజు వింత చూపులతణ్ని ఆపాదమస్తకం తడుముతున్నాయి.

సగటు కార్మికుని సంక్షేమమే ఈ దేశ శ్రామికవర్గానికి శ్రీరామరక్ష.

ఈ బ్యాగు తెచ్చివ్వకపోతే మూడు లక్షలు దక్కేవతనికి. కాని అలా చెయ్యలేదు.

నా దేశ కార్మికుడు నయవంచకుడు కాదు. నిజాయితీకి నీరాజనా లర్పిస్తాడు!

"నీ బ్యాంకు అప్పుకు జమానతు మీ అమ్మాయే ఇస్తుందిలే! ఆ సంగతి నేను

చూసుకుంటా కొమురయ్యా! నువ్వు బ్యాంకుకు రా, అప్పటికి నీ శారదను తీసుకుని రా. ఆమెకు ఎడ్యుకేషన్ లోన్ అంటే చదువుకోసం అప్పు యాభైవేలు ఇప్పిస్తా. ఈ అప్పు నువ్వు కట్టాల్సిన అవసరం లేదు. మీ అమ్మాయికి ఉద్యోగం దొరికిం తర్వాత ఆమెనే కట్టాలి" గట్టి హామీ ఇచ్చాడు.

పది ఆటోరిక్షాలకు తానే యజమాని అయినంత సంతోషమైంది.

"దండం సారూ వస్తా!" మురుసుకుంటూ వెళ్ళిపోయాడు.

అరెరే! కనీసం చాయ్‌గూడా తాగకుండా వెళ్ళిపోయాడే కష్టజీవి! నాగరాజు నిట్టూర్చాడు.

*(చిత్ర - డిసెంబర్ 2009)*